
# భక్తియే ముక్తి!



బ్రహ్మర్షి పత్రీజీ

# "భక్తియే ... ముక్తి!"

ఇటీవల క్రొత్తగా రూపొందిన "భక్తియే ... ముక్తి!" ఆడియో కేసెట్‌లో విజయవాడ పిరమిడ్ మాస్టర్ శ్రీ హరేరామ శర్మ గారు సంధించిన పలు ప్రశ్నల శరాలకు బ్రహ్మర్షి పత్రీజీ గారు అలవోకగా ఇచ్చిన సమాధానాలు అవలోకించండి.

– ఎడిటర్

## " శ్వాస మీదే ధ్యాస అంటే ? "

శ్వాస మీదే ధ్యాస పెట్టాలి ! నోరు మూసుకోవాలి ! మాట మీద ధ్యాస అన్నది శక్తిని పోగొడుతుంది కనుక ఏ మాటా ఉండకూడదు.

Physics మీకు తెలుసు కదా ! ఏ పని చేయ్యడానికైనా శక్తిని వెచ్చించాలి. కనుక 'ఓం' అన్నామనుకోండి, 'హ్రీం' అన్నామనుకోండి, మనం శక్తి పోగట్టుకుంటాం. కనుక ఏ మాట కూడానూ పలుకరాదు. ఉన్న ఆ ఒక్కగానొక్క శ్వాసక్రియనే గమనిస్తూ కూర్చోవాలి. ఇన్ని రోజులు మంత్రాలు జపించారు. ఇప్పుడు మంత్రాలను ఉపసంహారం చేసుకుని శ్వాసాను సంధానం చేయండి. అన్ని విధాలా పరిశోధించండి.... ఏది సరియైనదో మీకే తెలుస్తుంది. కనుక శ్వాసానుసంధానం ఒక్కటే సరియైన మార్గమన్న విషయం, ఈ యొక్క నామానుసంధానం, శ్వాసానుసంధానం రెండూ చేసిన వారికే తెలుస్తుంది.

ఏ విషయమైనా కూడానూ తెలియడానికి శాస్త్రీయ దృక్పథం కావాలి; శాస్త్రీయ పరిశోధన కావాలి. ఒక వస్తువు యొక్క గొప్పతనం తెలుసుకోవడం కోసం ఆ వస్తువు ఉండి ఒక experiment, వస్తువు లేకుండా ఒక experiment, చేసినప్పుడు, "ఆ వస్తువు యొక్క మహత్తు ఉందా ? లేదా ?" అని మనకు తెలుస్తుంది. దీనినే "శాస్త్రీయ దృక్పథం" అంటాం. "Scientific Temper" అంటాం. కనుక ఒక రోజంతా "రామ ! రామ ! రామ !" అంటూ మీరు గడపండి, ఒక రోజంతా శ్వాసానుసంధానంతో

గడపండి. అప్పుడు ఏది బాగో, ఏది బాగోలేదో మీకే తెలుస్తుంది. ఎవరికైనా తెలుస్తుంది. కనుక శాస్త్రీయ పరిశోధన గావించి ఏ విషయాన్నైనా ఎవరికి వారే తెలుసుకోవాలి. ఒక ప్రతిపాదన చేయబడుతుంది. దాన్ని స్వీకరించడమో.... తృణీకరించడమో.... ఎవరి ఇష్టం వాళ్ళది!

## " సంగీతం ఎందుకు ? "

సంగీతం అనేది The next best thing to ధ్యానం! ధ్యానం అన్నిటికన్నా సర్వోత్తమమైంది. ధ్యానం తర్వాత సర్వోత్తమమైంది సంగీతం. మనిషిని విషయ ప్రపంచం నుంచి సుసంగీతం అన్నది సుదూరంగా తీసుకుని వెళుతుంది. సంగీత ప్రపంచం నుంచి ధ్యాన ప్రపంచంలోకి వెళ్ళడం చాలా చాలా తేలిక, కనుకనే సంగీతం తప్పనిసరి. శ్రావ్యమైన, మధురమైన, సున్నితమైన సంగీతం, ముఖ్యంగా వాద్య సంగీతం ధ్యానానికి ఎంతైనా శ్రేయస్కరం.

## " ధ్యానం చేసిన తరువాత కళ్ళ మీద చేతులు ఎందుకు పెట్టాలి ?"

ఎప్పుడైతే మనం ధ్యానంలో ఉంటామో.... అర్ధగంటో గంటో.... అపారమైన శక్తి విశ్వమయప్రాణశక్తి మన శరీరమంతా ప్రవహిస్తుంది. శరీరమంతా ప్రవహించినా చేతి వ్రేళ్ళలోకి ఎక్కువగా చేరుకుంటుంది. చేతి వ్రేళ్ళలో ఎక్కువగా చేరుకున్న ఆ యొక్క ప్రాణశక్తిని మళ్ళీ మన కళ్ళ ద్వారా మన శరీరంలోకి ప్రవేశింప చేసుకోవాలి. మనకై అది వినియోగించుకోవాలి. లేకపోతే ఇతరులకైనా దాన్ని ప్రసాదించాలి. "తనకు మాలిన ధర్మం లేదు" కనుక ముందు మనకే ప్రసాదించుకోవాలి! కనుక ధ్యానం పరిసమాప్తం కాగానే కళ్ళు తెరవకుండా మన చేతులను మన కళ్ళ మీద పెట్టుకోవాలి. తప్పనిసరిగా! మనశక్తి ముందు మనకు, పరంపరగా ఇంకెవ్వరికైనా అత్యవరస పరిస్థితులలో మాత్రమే. ఇంకొకరి తల మీద చేతులు పెట్టడమనేది.... "హస్తమస్తక సంయోగం...." అంటే మన చేతుల్లో ఉన్న శక్తిని ఆ యొక్క మస్తిష్కం తీసుకుంటుంది. ఎవరికైనా కూడానూ వాడు చావు బ్రతుకుల్లో ఉన్నప్పుడు తప్ప శక్తిని ప్రసాదించరాదు. మిగతా సమయాల్లో మనశక్తి మన కోసమే! అందుకోసమే ఆ యొక్క క్రియను మనం చెబుతాం.

## " మాంసాహారం నిషిద్ధమా ?"

మాంసాహారం జీవితానికే విరుద్ధం. ధ్యానం ఏమిటి ? ధ్యాని కానివాడు మాంసం తినవచ్చేంటి ? ఎట్లా ? ధ్యానానికీ మాంసానికీ సంబంధమే లేదు. సరియైన జీవితానికీ మాంసానికీ సంబంధం ఉంది. కనుక, ఎవడైతే మాంసపు కూడు తింటాడో వాడు మహానికృష్టపు కూడు తింటున్నట్టు ! కనుక వాడి జీవితం, వాడి శరీరం అస్తవ్యస్తమై అంధకారబంధురమై ఉంటుంది; వాడి మనస్సు క్రూరంగా తయారవుతుంది. As you eat so you become.... నువ్వు ఏది తింటావో అదే అవుతావు! మాంసం అనేది ఈ యొక్క భూగోళం యొక్క దరిద్రానికి ఏకైక కారణం. Non-vegetarian-ism అనేది ఈ ప్రపంచపు నికృష్ట పరిస్థితులకు ఏకైక కారణం. కనుక ధ్యానం చేసినా చెయ్యకపోయినా ఫరవాలేదు. మాంసం మాత్రం తినరాదు. మాంసం తినకుండా ఉండడమనేది మొట్టమొదటి మన సందేశం. ధ్యానం చెయ్యమని చెప్పడం అనేది పరంపరగా రెండవ సందేశం. అందుకోసం అంతగట్టిగా మరీ చెబుతాం, "మాంసం తినరాదు ! మాంసం మాంసం ! తినరాదు !" అని.

## " నిద్ర - కల - ధ్యానం -వ్యత్యాసం ? "

నిద్ర, కల, ధ్యానం అన్నాం. నిద్రలో వచ్చేది కల. కల సంగతి వదిలి పెట్టెయ్యండి. కల అనేది నిద్రలో ఓ భాగం.

నిద్ర, ధ్యానం ఈ రెండూ కూడానూ శరీరాన్ని సేదతీర్చే చర్యలు. కనుక నిద్రలో ఓ ఆరు గంటలు నిద్రపోతాం. ప్రొద్దున్నే లేస్తాం. శరీరం ఎంత సేదతీరి ఉంటుందో ! శరీరాన్ని సేద తీర్చడం, అంతే కాకుండా శరీరానికి నూతన శక్తిని ఇవ్వడం.... రెండూ కూడానూ నిద్ర లోనూ ధ్యానం లోనూ సరిసమానంగా జరుగుతాయి. నిద్రలో కానీ ధ్యానంలో కానీ సూక్ష్మశరీరం అన్నది స్థూలశరీరం నుండి విడివడి అనేక సూక్ష్మలోకాల్లో.... శక్తిలోకాల్లో సంచరించి తిరిగి వచ్చేటప్పుడు శరీరంలో ప్రవేశించేటప్పుడు నూతన శక్తిని తీసుకుని వస్తూంటుంది. అయితే ధ్యానంలో నూతన జ్ఞానం కూడా అదనంగా వస్తుంది. నిద్రలో అంత ఎక్కువగా నూతన జ్ఞానం రాదు. నూతన శక్తి మటుకు వస్తుంది. నిద్రకూ ధ్యానానికీ తేడా ఏమిటంటే శక్తి అన్నది రెండింటికీ చెందినది, జ్ఞానం అన్నది ధ్యానానికి చెందినది; నిద్ర ద్వారా జ్ఞానం రాదు.

ధ్యానం ద్వారా జ్ఞానం వస్తుంది. నిద్ర ద్వారా కూడానూ శరీరం మరింతగా సేద తీరుతుంది. ధ్యానం ద్వారా శరీరం మరింతగా సేద తీరుతుంది. శరీరానికి ఇంకెంతో శక్తి, వేయిరెట్లు ఎక్కువ శక్తి వస్తుంది.

## " అందరికీ ధ్యానం అవసరమా ?"

విద్యార్థులకేమిటి? ఉపాధ్యాయులకేమిటి? ఆడవాళ్ళకేమిటి?? మగవాళ్ళకేమిటి? రాజులకేమిటి? పేదలకేమిటి? అందరికీ ధ్యానం కానీ నిద్ర కానీ సరిసమానమే కదా ! విద్యార్థులకు ఒక విధంగా నిద్ర ఉపయోగపడి, రాజుకు వేరొక విధంగా ఉపయోగపడుతుందా ?! ఉపాధ్యాయులకు వేరొక విధంగా ఉపయోగపడుతుందా ?! నిద్ర అనేది విద్యార్థులకు, ఆడ, మగ, రాజు, పేదకు అందరికీ సరిసమానం కదా !

అదే విధంగా ధ్యానం కూడా ! నిద్ర ఎంత ముఖ్యమో జీవితంలో ధ్యానం అంతకన్నా రెండింతలు ముఖ్యం. కనుక కేవలం నిద్రాలోలుడైన సగటు మానవుడు కానీ, సగటు విద్యార్థి కానీ సగటు ఉపాధ్యాయుడు కానీ ఇకనుంచి అర్జెంటుగా ధ్యానలోలుడు కావాలి !

నిద్రా ప్రపంచంలో విశ్రమించే వాడు ఇకనుంచి విశేషంగా ధ్యాన ప్రపంచంలోనూ విశ్రమించాలి. నిద్రకు ధ్యానం తోడుకావాలి. నిద్రా జీవితానికి ధ్యాన జీవితం తోడుకావాలి. విద్యార్థులకు గానీ, ఉపాధ్యాయులకు గానీ, స్త్రీలకు గానీ, పురుషులకు గానీ, పిల్లలకు గానీ, పెద్దలకు గానీ ఎవరికైనా గానీ కావలసినది చేపట్టిన పనులలో విజయం. ఆ చేపట్టిన పనులు విజయవంతం కావడానికి ఆత్మస్ఫూర్తిని, ఆత్మశక్తిని ప్రసాదించేదే ధ్యానం. కనుక విద్యార్థులకు కూడానూ తాము చేపట్టిన పనులలో విజయం కావాలి కదా! దానికి కావలసిన స్ఫూర్తి, శక్తి అంతా ధ్యానం లోంచే విశేషంగా వస్తుంది.

## " భక్తి అంటే ?"

*"స్వస్వరూపానుసంధానం భక్తిరిత్య భిధీయతే !"* అని ఉపనిషత్ వాక్యం. అంటే స్వస్వరూపంలో అనుసంధానం.... నాతో నేను ఉండడం..... **నా గురించి నేను తెలుసుకోవడం, నేను నేనుగా ఉండడం దానిపేరే భక్తి.** "స్వస్వరూపానుసంధానం భక్తిరిత్య భిధీయతే".... ఇది చాలా, చాలా ముఖ్యమైంది. భక్తి అంటే ఇంకెవడికో

మరి మ్రొక్కడం, "బాంచను దొరా కాల్మొక్త !" అనడం కాదు. **భక్తి అంటే నీ యొక్క శక్తిని తెలుసుకుని ఆ శక్తితో కలిసి ఉండటమే.** భక్తి అంటే స్వభక్తి.... పరభక్తి కాదు. ధర్మం అంటే స్వధర్మం.... పరధర్మం కాదు. ధ్యాస అంటే స్వధ్యాస.... పరధ్యాస కాదు. జీవితం అంటే స్వజీవితం పర జీవితం కాదు. వశం అంటే స్వవశం కావాలి.... పరవశం కారాదు. కనుక మై డియర్ ఫ్రెండ్స్.... భక్తి అంటే స్వంతానికి శరణాగతి కావడం.... పరులకు శరణాగతి కావడం కాదు.

***"స్వస్వరూపానుసంధానం భక్తిరిత్య భిధీయతే !"*** 'స్వాధిపత్యం సంపాదించడమే భక్తి. పరాధీనం అన్నది భక్తి కాదు. కానీ అదేం చోద్యమో ఈ భారతదేశంలో ఈ భూమండలాన్ని ఏలుతున్న బ్లాక్ టీచర్స్ ఇతర లోకాల నుంచి వచ్చి ఈ భూమండలాన్ని ఆక్రమించుకున్న శక్తులు భక్తి పేరిట అజ్ఞానాన్ని విరజిమ్మి ఆ అజ్ఞానాన్ని పోషించి ఉన్నారు. కనుకనే "భక్తి" అంటే ఇంకెవరికో కాళ్ళు మ్రొక్కాలి, ఇంకెవరికో పరాధీనపు బ్రతుకు బ్రతకాలి అన్న భావనలు వచ్చాయి. ఇదంతా కూడానూ సంపూర్ణంగా తప్పు.... అన్నదానికి ఉపనిషత్ వాక్యమైన ***స్వస్వరూపానుసంధానం భక్తిరిత్య భిధీయతే*** అన్నదే నిదర్శనం.

## " విగ్రహారాధన నిషిద్ధమా "?

"భక్తి అంటే స్వస్వరూపానుసంధానం" అని మరొక్కసారి మీకు చెప్పాలి కదా ! చెబుతున్నాను. మరొక్క సారి.... మరొక్క సారి.... మరొక్క సారి.... వెయ్యిసార్లు .... లక్షసార్లు.... కోటిసార్లు.... శతకోటి సార్లు చెప్పడమే నా యొక్క పని. ఏ జ్ఞాని యొక్క పనైనా కూడానూ.... స్వస్వరూపానుసంధానం భక్తిరిత్య భిధీయతే.

## " ముక్తి అంటే ? "....

భక్తియే ముక్తి. *స్వస్వరూపానుసంధానమే **ముక్తి !*** ఎక్కడ భక్తి లేదో అక్కడ ముక్తి లేదు. ఎక్కడ స్వస్వరూపానుసంధానం లేదో అక్కడ ముక్తి లేదు ! భక్తియే ముక్తి !

## " సంచిత కర్మ - ప్రారబ్ధకర్మ - వర్తమాన కర్మ అంటే ?"

మూడు రకాల కర్మలు ఉన్నాయి. సంచిత కర్మలు, ప్రారబ్ధ కర్మలు, వర్తమాన కర్మలు. సంచిత కర్మలు అంటే అనేక జన్మలుగా మనం చేసుకొచ్చిన శుభ అశుభ కర్మల యొక్క సంపూర్ణ చిట్టా.

ఆ సంపూర్ణ చిట్టాల లోంచి కొంత భాగం అనుభవించడానికి.... ప్రత్యక్షం చేసుకోడానికి శుభం కానీ, అశుభం కానీ కొంత అనుభవించడానికి విధిగా, తప్పనిసరిగా కొంత కర్మను ఈ శరీరంతో పాటు ఈ శరీర నిర్మాణంలోనే ప్రతిష్టించుకుంటాం. అది ప్రారబ్ధకర్మ. అది అనుభవించి తీరవలసిందే! అనుభవించడం కోసమే ఎన్నుకోబడింది! సంచిత కర్మలో ఒకానొక భాగం ప్రారబ్ధకర్మ. ఆ ప్రారబ్ధకర్మను అనుభవిస్తూనే ఒక ప్రక్క మళ్ళీ క్రొత్తగా నూతన వర్తమాన కర్మలు చేస్తూ ఉంటాడు ప్రతి జీవుడూ.... ప్రతి శరీరంలోనూ, ప్రతి జీవితంలోనూ. వీటిని "వర్తమాన కర్మలు" అంటాం.

ఈ వర్తమాన కర్మలలో మళ్ళీ శుభ కర్మలు, అశుభ కర్మలు ఉంటాయి. మళ్ళీ శరీరం వదిలి పెట్టేసిన తరువాత ఆ సంచిత కర్మల బ్యాంక్ బ్యాలెన్స్ లో అవి జత చేయబడుతాయి. మళ్ళీ ఇంకొక జన్మ వచ్చినప్పుడు అందులోంచి ఆ టోటల్ లో డెబిట్, క్రెడిట్ లోంచి శుభ, అశుభ కర్మల సంచీ లోంచి కొంత తీసుకుని శుభం అనుభవించడానికీ, అశుభం అనుభవించడానికీ ప్రారబ్ధంగా తీసుకుని వస్తాం. ఈ విధంగా సాగుతూంటూంది ఈ జన్మకర్మల సంచారం.

ఆత్మజ్ఞానం కలుగకపోతే మళ్ళీ వర్తమాన కర్మలో 'శుభం' 'అశుభం' అన్నవి ఉంటాయి. ఆత్మజ్ఞానం వస్తే శుభాశుభ పరిత్యాగి. ఇక్కడ శుభ కర్మ, అశుభకర్మ లేదు. అసలు 'కర్మ' అన్నదే లేదు! కనుక ఈ జాడ్యం నుంచి విముక్తుడవుతాడు జ్ఞానం ద్వారా.

జ్ఞానాగ్ని దగ్ధ కర్మాణం ! "సకల కర్మలూ జ్ఞానం అనే అగ్నిలోనే దగ్ధమవుతాయి!

ఇందంతా కూడానూ చాలా వివరంగా తెలుసుకోవలసిన సబ్జెక్ట్. కర్మ సిద్ధాంతం గురించి.... ప్రారబ్ధ కర్మ గురించి సంచిత కర్మ గురించి వర్తమాన కర్మ గురించి.... ఇలా అడిగిస్తే, నేను చెప్పేస్తే మీకు అర్థం అయిపోతుందేమిటి ? జీవితంలో వాటితో జీవించాలి ! అధ్యయనం చేయాలి ! శుశ్రూష చేయాలి ! గురు శుశ్రూష చేయాలి !

## "కర్మసిద్ధాంతం అంటే ?"

1998వ సంవత్సరంలో మహారాష్ట్రలో సాంగ్లీ పిరమిడ్ మాస్టర్ అయిన దేశబంధు ధ్యానంలో ఉన్నప్పుడు.... భీష్ముడు వచ్చి ఒక చక్కటి సందేశాన్నిచ్చాడు.... కర్మ సిద్ధాంతం గురించి ఇంగ్లీషులో ఇచ్చాడు. దానిని శ్రీ సాయి సుదర్శన్ గారు తెలుగులోకి అనువదించడం జరిగింది. పిరమిడ్ స్పిరిచ్చువల్ సొసైటీస్ వారు ప్రచురించిన ఈ

"కర్మ సిద్ధాంతం" పుస్తకాన్ని దయచేసి చదవండి.... విస్తారంగా ఈ యొక్క కర్మ సిద్ధాంతం గురించి వినూత్నంగా భీష్ముడి దగ్గరి నుంచి వచ్చిన సమాచారం.

## " ఏది సత్యం ?"

పూర్వం నుంచి వచ్చిన మత గ్రంథాలను విస్తారంగా ప్రక్కన పెట్టేసి ప్రస్తుతం ఉన్న **న్యూ ఏజ్ స్పిరిచ్యువల్ పుస్తకాలను** చదవండి. ఈ యొక్క న్యూ ఏజ్ స్పిరిచ్యువల్ పుస్తకాలలో సత్యం సూటిగా చెప్పబడింది. ముక్కుసూటిగా చెప్పబడింది. పూర్వపు పుస్తకాలలో ఇంత ముక్కు సూటితనం లేదు. ఉన్నా ఎక్కడో మచ్చుతునకలా ఉంది. కనుక మైడియర్ ఫ్రెండ్స్ please read the new age spiritual literature.... రిచార్డ్ బాక్, కార్లోస్ కాస్టనెడా అనీ బిసెంట్, లెడ్‌బీటర్, సేత్ మెటీరియల్, బార్బరా అన్ బ్రెన్నన్ బార్బరా మార్సిన్యాక్, సిల్వియా బ్రౌన్, బార్బరా హాండ్ క్లో మొదలైన వారి పుస్తకాలు చదవండి అందులో చక్కగా సూటిగా సత్యం చెప్పబడింది. ఆత్మ పదార్ధమే సత్యం. ఈ ధ్యాస ప్రకారమే వాస్తవికత reality.... యొక్క encounters ఉంటాయి. అంతే సత్యం ! అంతకన్నా ఇంకేమీలేదు ! ***" యద్భావం తద్భవతి "*** అన్నదే సత్యం.

## " తపస్సు అంటే ?"

సాధనా తీవ్రతనే "తపస్సు" అంటారు. సంగీతంలో తపస్సు చేశాడంటే ఏమిటర్థం ? వాడు సంగీత సాధనలో తీవ్రతరంగా ఉన్నాడు అని. గవాస్కర్ cricket తపస్సు చేశాడు. తపస్సు చేసాడు కనుకే గవాస్కర్ గొప్ప క్రికెట్ ప్లేయర్ అయ్యాడు. సంగీతంలో తపస్సు చేశాడు కనుక బిస్మిల్లాఖాన్ అంతటి సంగీత విద్వాంసుడయ్యాడు. అలాగే ధ్యాన తపస్సు చేస్తే మనమూ అవుతాం కృష్ణుడిలా ! బుద్ధుడిలా ! మహావీరుడిలా ! వాళ్ళు చేసింది తపస్సు ! ధ్యాన తపస్సు ! సాధనా తీవ్రతనే తపస్సు అంటాం.

## " ఆనందం అంటే ?"

ఆనందాలు ఐదురకాలు. ఐదింటి సంకలనం మనం *1.* శరీరము *2.* మనస్సు *3.* బుద్ధి *4.* ఆత్మ *5.* సర్వాత్మ.

శరీరంతో ఇడ్లీ సాంబారు తింటే అది శరీరానందం. మనస్సుతో సంగీతం విన్నామనుకోండి, ఒక ప్రకృతి దృశ్యాన్ని చూశామనుకోండి అది మనస్సు పరమైన

ఆనందం ! సూర్యోదయం సూర్యాస్తమయం మనస్సుకు ఎంత ఉల్లాసాన్నీ ఆనందాన్నీ కలిగిస్తాయో ! అది మనస్సు పరమైన ఆనందం. ఒక సోక్రటీస్ పుస్తకం కానీ, ఒక షేక్స్‌పియర్ పుస్తకం కానీ చదివామనుకోండి. అది బుద్ధి పరమైన ఆనందం. ధ్యానం ఉందనుకోండి ఆలోచనా - రహిత - స్థితిలో.... అది ఆత్మానందం. తోటి ఆత్మజ్ఞానులతో కలిసి జీవించామనుకోండి అది బ్రహ్మానందం. సకల సృష్టితో జీవించడం, ఆ స్నేహంతో జీవించడం బ్రహ్మానందం !

కనుక

*శరీరవత్.... శరీరానందం వుంది !*

*మనస్సువత్ .... మానసికానందం వుంది !*

*బుద్ధివత్.... బుద్ధిపరమైన ఆనందం వుంది !*

*ఆత్మవత్.... ఆత్మానందం వుంది !*

బ్రహ్మవత్ .... అంటే సకలసృష్టి కోటివత్ బ్రహ్మానందం ఉంది.

ఐదురకాల ఆనందాలు ఉన్నాయి. మై డియర్ ఫ్రెండ్స్, ఇవి ఐదూ ఉన్నప్పుడే పూర్ణ జీవితం. ఈ ఐదింటిలో ఏది లుప్తమయినా అది అసంపూర్ణ జీవితం.

## “ దివ్యచక్షువు...అంటే ?”

మూడవకన్ను అంటే ఆత్మ ! శరీరానికి రెండు కళ్ళు ఉంటాయి. శరీరంలో దేహి ఉంటుంది. దేహి అనేది దేహంతో కూడుకుని ఉంటుంది. ఈ దేహి యొక్క అనుభవమే.... దేహంతో ఉన్నప్పుడు.... అది మూడవ కన్ను అంటాం. దేహంలో నుంచి దేహి నిష్క్రమించినప్పుడు అక్కడ మూడవ కన్ను కాదు.... అది ఆత్మ యొక్క సహజశక్తి. ఆత్మ యొక్క సహజశక్తి భౌతిక కాయంతో అభివ్యక్తమైనప్పుడు “మూడవ కన్ను ఉత్తేజితమైంది” అంటాం.

## “ కండలినీ శక్తి అంటే ? ”

ఈ ఆత్మ యొక్క శక్తి ఎప్పుడైతే అది శరీరంలో విశేషంగా ప్రకటితం కావడం జరుగుతుందో దానిని కుండలినీ ఉత్తేజితం అంటాం. కనుక ఎప్పుడైతే మనస్సు పరిపరి విధాల ఆలోచిస్తూ ఉంటుందో.... ఎప్పుడైతే పరిపరి విధాల ఆలోచించే ఆ యొక్క మనస్సు నిర్మాణుష్యమైనప్పుడు ఆత్మ యొక్క శక్తి.... క్షీణించి ఉన్న ఆత్మ యొక్క శక్తి దేహంలో విస్తారంగా ఉత్తేజితమైనప్పుడు దానిని కుండలినీ ఉత్తేజితం అంటారు.

కుండలినీ అంటే మూడున్నర చుట్లలో ముడుచుకుని ఉన్న ఆత్మశక్తి. "పరిపరి విధాల ఆలోచనల వల్ల సంకల్ప వికల్పాల సముద్రంలో ఆత్మ యొక్క శక్తి మూడున్నర చుట్లలో ముకుళించుకుని పడుకుని నిద్రాణమై ఉంది" అంటాం. ఎప్పుడైతే మనస్సు నిర్మానుష్యమై వుంటుందో, సంకల్ప వికల్ప రాహిత్యమైందో అప్పుడు ఆ మూడున్నర చుట్లలో పడుకుని ఉన్న ఆ యొక్క విస్తారమైన ఆత్మశక్తి అది విదిలించుకుని మరి ఉత్తేజితమై, శరీరవ్యాప్తమై శరీరంలోని అశుద్ధాన్ని దగ్ధం చేసి నాడీ మండల శుద్ధి చేసి శరీరాన్ని వజ్రపు తునకగా చేస్తుంది. ఈ యొక్క ప్రక్రియనే "కుండలినీ ఉత్తేజితం," "నాడీ మండల శుద్ధి" అంటాం. అంతకన్నా ఇంకేమీ లేదు. అది కవి యొక్క వర్ణన.... పడుకుని ఉంది పాము, మూడున్నరచుట్టులు చుట్టుకుని. ఇదంతా కవితాధోరణి. కవిత ఉండాలి కదా! కవిత అనేది మానవుడి యొక్క ఉత్కృష్టమైన భావ ప్రకటనా స్థితి. కూసంత కళాపోషణ వుండాలి అన్నారు మన రావు గోపాలరావు గారు ఓ సినిమాలో ! అలాగే ఆధ్యాత్మిక శాస్త్రజ్ఞులకు కూడా కవితా ధోరణి ఉంది. కనుకనే "ఈ పాము పడుకుంది.... మూడున్నర చుట్టలు ఉంది".... అని చక్కగా కవిత్వ ధోరణిలో చెప్పారు. జరిగేది ఏంటంటే క్షీణదశలో ఉన్న ఆత్మశక్తి ధ్యానం ద్వారా ఆలోచనా-రహిత-స్థితి ద్వారా విస్తారంగా ప్రచండంగా ప్రజ్వరిల్లుతుంది. దీనినే "కుండలినీ ఉత్తేజితం" అంటాం.

## " శత్రువులు అంటే ? "

మొట్టమొదటగా తెలుసుకోవాలసింది ఏంటంటే కామ, క్రోధ, లోభ, మద మాత్సర్యాలనేవి old age పదాలు! అసలు "అంతర్ శత్రువులు" అనీ ఎక్కడా లేవు. నిజానికి చెప్పాలంటే ఏదీ శత్రువు కాదు. స్వతహాగా కామం కానీ, కోపం గానీ మోహం గానీ, మదం గానీ, మాత్సర్యం గానీ మనకు ఎంతో మిత్రులు కావచ్చు. అంతా ఉపయోగించుకునే తీరులో ఉంది. సమయాసమయాలను బట్టి సందర్భాసందర్భాలను బట్టి, అవి ఒక సారి మిత్రుడుగా ఒకసారి శత్రువుగా తయారు కావచ్చు.

అయితే నిజానికి, వాస్తవానికి మూడింటి గురించి చెప్పుకోవాలి. ఒకటి తమోగుణం, రెండవది రజోగుణం, మూడవది సాత్విక గుణం. ఈ మూడు కూడానూ మనకు ఒక స్థాయిలో మిత్రత్వాన్ని ఇంకొక స్థాయిలో శత్రుత్వాన్ని కలిగిస్తాయి.

**ఉదాహరణకు** మీరు Law of Diminishing Returns వినే వుంటారు. మీకు బాగా ఆకలి వేస్తూ ఉన్నప్పుడు ఒక apple తిన్నారు. బాగుంది. రెండవ apple

తిన్నారు. చాలా బాగుంది. మూడవ apple తిన్నారు. మొహం మొత్తుతుంది. నాల్గవ apple తిన్నారు. డోకు వస్తుంది. ఐదవ apple తిన్నారు శరీరం చెడిపోతుంది. Too much is too bad. అతి సర్వత్ర వర్జయేత్ ! తమోగుణం మొట్టమొదట్లో కొన్ని దశలలో మిత్రుడుగా ఉంటుంది. అదే తమోగుణం ఎక్కువయితే అది శత్రుత్వంగా మారుతుంది.

కొంచెం త్రాగుతాం అనుకోండి. Alchohol చిన్న Peg త్రాగితే ఏమీ కాదు. బాటిళ్ళు బాటిళ్ళు త్రాగితే, ఏమవుతుంది ?? కనుక అక్కడ అది శత్రువుగా పరిగణింప బడుతుంది. ఒక Peg తీసుకున్నాం అనుకోండి అది శత్రువు గాదు. ఒక బాటిల్ మొత్తం గటగటా త్రాగేస్తే అది శత్రువు అవుతుంది.

డబ్బు కూడానూ.... డబ్బు సంపాదన తగు మోతాదులో ఉంటే మిత్రత్వం. ఎక్కువ డబ్బు సంపాయించామనుకోండి. డబ్బు మిమ్మల్ని దాసుల్ని చేసుకుంటుంది. కనుక ఏదైనా కూడానూ.... అతి సర్వత్ర వర్జయేత్. మోతాదుకు మించిన లోభం. మోతాదుకు మించిన మోహం, మోతాదుకు మించిన మదం, మోతాదుకు మించిన మాత్సర్యం.... ఇవన్నీ కూడానూ శత్రువులు ! కనుక అవి స్వతహాగా శత్రువులు కావు ! అయితే ఏది మోతాదు ? ఎవరికి మోతాదు ? ఒకడికి మోతాదు అయినది ఇంకొకడికి మోతాదు కాజాలదు.

**ఉదాహరణకు :** ద్రౌపది తన భర్తలు అయిదుగురికి భోజనం వడ్డించినప్పుడు భీముడికి ఎక్కువ వడ్డించేది. ఎందుకు అంటే భీముడికి ఎక్కువ కావాలి గనుక ! మిగతా వాళ్ళకు అంత అక్కరలేదు. కనుక శరీరాన్ని బట్టి మోతాదు ఉంటుంది. మరి ఏ మోతాదు ఎవరికి.... సరిపోతుందనేది.... ఒక మనిషి ఇంకొక మనిషికి ఎవ్వరూ చెప్పలేరు. వీటన్నింటినీ అంతర్ శత్రువులని చెప్పి వాటిని భూతద్దంతో చూపించి మనలను సర్వనాశనం .చేశారు.... మన భారతదేశీయ యోగ వేదాంతులు. దానికి పూర్తి విరుద్ధంగా సంపూర్ణంగా వున్నవారు పిరమిడ్ మాస్టర్స్ ! మై డియర్ ఫ్రెండ్స్, అంతర్ శత్రువులనేవి ఎక్కడాలేవు. కనుక "మనస్సులో ఎవరో నాకు అంతర్ శత్రువులున్నారు.... వాళ్ళను అధిగమించాలి" అని అనుకున్నవన్నీ అదేదో వికృత జీవితానికి సోపానాలు అవుతాయి. మూర్ఖపు జీవితానికి నాంది పలుకుతాయి. ఏదీ శత్రువు కాదు. అన్నీ చక్కటివే.

ధ్యానం చేస్తే చాలు. పుస్తకాలు చదివితే చాలు, సజ్జన సాంగత్యం చేస్తే చాలు. చెయ్యవలసిన వాటిని చేస్తే.... మనలో ఏవైనా పోగొట్టుకోవలసినవి ఉంటే అవి

తమంతట తాము పరిగెత్తుకుని పోతాయి. వాటి గురించి మనకు చింత వద్దు! పోగొట్టుకోవలసిన వాటి మీద దృష్టి పెట్టవద్దు. సంపాదించుకోవలసిన వాటిపై దృష్టిపెట్టాలి! అదీ సంగతి! జీవితాన్ని సరియైనదిగా చేసుకునే విధానం మన లోపల వుంది! ఏది లేదో దాన్ని సమకూర్చుకోవాలి. ధ్యానం లేదు.... ధ్యానం చెయ్యాలి; పుస్తకాలు చదవటం లేదు సరియైన పుస్తకాలు చదవాలి; సరియైన మిత్రులు లేరు.... సరియైన మిత్రులతో ఉండాలి. అప్పుడు మీరంటున్నారే మిత్రమా! ఈ యొక్క అంతర్ శత్రువులు వాటంతట అవేఅవి మటుమాయం అయిపోతాయి; వాటి గురించి చింతవలదు మిత్రమా!

## "ధ్యానానుభవాల విశ్లేషణ ....?"

ధ్యానంలో ఉన్నప్పుడు.... "ఏవేవో అనుభవాలు".... అని చిన్న చూపు చూడవద్దు. అనుభవాలకోసమే ధ్యానం ఉంది. ధ్యానంలో వచ్చేవి అద్భుతమైన అనుభవాలు.... ఏవేవో అనుభవాలు కాదు! ధ్యానంలో అనేకానేక ఆత్మానుభవాలు వస్తాయి. ధ్యానంలో నాడీమండల శరీరం శుద్ధమవుతుంది. అందులో ఉన్న అశుద్ధత అంతా తొలగిపోతుంది. కనుక ఇవన్నీ కూడానూ ఏవేవో అనుభవాలు కావు. జరుగవలసిన, కోరుకోవలసిన, కోరుకున్న అనుభవాలు! ఎప్పుడైతే అనుభవాలు వస్తూంటాయో అప్పుడు అనుభవాల మీద ధ్యాస. అనుభవాలు లేనప్పుడు.... ఆలోచనలో ఉన్నప్పుడు.... శ్వాస మీద ధ్యాస. ఆలోచనలను పరిసమాప్తం చేయడం కోసం శ్వాస మీద ధ్యాస. శ్వాస మీద ధ్యాస ఉన్నందువలన అనతికాలంలోనే అనుభవాలు వస్తాయి. అనుభవాలు వస్తూన్నప్పుడు ఇక వాటి మీదే ధ్యాస. కొంత సమయం తరువాత అనుభవాలు పరిసమాప్తమయి పోతాయి. మళ్ళీ ప్రాపంచిక ఆలోచనలు వస్తూంటే అప్పుడు మళ్ళీ శ్వాస మీద ధ్యాస.... ఆలోచనల మీద ధ్యాస కాకుండా ఆలోచనలు ఉన్నప్పుడు శ్వాస మీద ధ్యాస, శ్వాస మీద ధ్యాస ద్వారానే అనుభవాలు వస్తాయి. ఇలా గొప్ప అనుభవాలు వచ్చినప్పుడు అనుభవాల మీద ధ్యాస. ఇది ప్రతి రోజూ సాధనా కార్యక్రమం.

ఇవాళ్ళ అనుభవం వచ్చింది. శుభ్రరంగా మర్చిపోండి. మళ్ళీ క్రికెట్ ఆడుకోండి. ఇండియా ఆస్ట్రేలియా మ్యాచ్ చూడండి. రేపు మళ్ళీ ధ్యానం చెయ్యండి. ఇవ్వాళ ఏం జరిగిందో దాని యొక్క next step వస్తుంది. ఇవ్వాళ ఇక అనుభవం వచ్చిందనుకోండి. "A,B,C,D లు" అనే అనుభవం వచ్చిందనుకోండి. మీరు ఉత్తరోత్తరా చేసే ధ్యానం

సాధన వల్ల "E,F,G,H,I,J" అన్న అనుభవాలు వచ్చిన తరువాత మీకు A,B,C,D అన్న అనుభవం యొక్క పరిజ్ఞానం.... దాని యొక్క అందం చందం.... మీకు సంపూర్ణంగా తెలుస్తాయి. అంత వరకు మీకు తెలియదు! A,B,C,D అనుభవం వచ్చినప్పుడు దాని గురించి ఎవరినడిగినా, ఎవరు చెప్పినా మీకు ఏమీ అర్థం కాదు. కనుక "A,B,C,D అనుభవాలు" ఉన్నవాళ్ళు పరంపరగా' "E,F,G,H,I,J" దాకా వెళ్ళినప్పుడు అప్పుడే సరిగ్గా ఈ "A,B,C,D" అర్థం అవుతుంది. "M,N,O,P" నుండి ఇంకా ముందుకు వెళ్ళి X,Y,Z కి వెళ్ళినప్పుడు ఈ "M,N,O,P" అన్నది అర్థం అవుతుంది. మీరు "X,Y,Z" లో ఉన్నప్పుడు మిగతావాళ్ళకు "A,B,C,D" నేర్పించినప్పుడు మీరు "X,Y,Z" అన్నది ఇంకా బాగా అర్థం అవుతూంటుంది. ఇలా నిరంతరంగా సాగుతూంటుంది అన్నమాట అంతా హనుమంతుని తోకలా!

## "ఆధ్యాత్మికత అంటే ?"

హాయిగా ఆనందంగా జీవించడం.... ఎప్పుడూ ఏడవకుండా ఉండడం.... ఇంకొక్కళ్ళ పర్సనల్ జీవితాల్లో వ్రేలు పెట్టకుండా ఉండడం! ఇదే ఆధ్యాత్మిక జీవితం!

## "బుద్ధత్వం అంటే ?"

"ఆధ్యాత్మికత" అన్నా, "బుద్ధత్వం" అన్నా రెండూ ఒక్కటే! అది వేరే.... ఇది వేరే కాదు. Christ Consciousness అన్నా, బుద్ధత్వం అన్నా, Krishna Consciousness అన్నా, కాస్మిక్ సైన్స్, అన్నా ఆధ్యాత్మికత అన్నా, ఎన్‌లైటెన్‌మెంట్ అన్నా, సాల్వేషన్ అన్నా, మోక్షం అన్నా అపవర్గం అన్నా, నిశ్రేయస్సు అన్నా.... ఇవన్నీ కూడానూ, పర్యాయపదాలు.... alternate terms.

## "ఆత్మ సాక్షాత్కారం అంటే ?"

నీ యొక్క కర్మలకు నువ్వు సాక్షీభావం పొందటమే. ఆత్మంటేనే కర్మలు! సాక్షి అంటే, witness.... నీ యొక్క కర్మలకు నువ్వే సాక్షివి. సాక్షీతత్వాన్ని పెంపొందించు కోవడమే, ఆ స్థితికి రావడాన్నే 'ఆత్మ సాక్షాత్కారం' అనవచ్చు.

## " యోగిని గుర్తించడం ఎలా ? "

" నువ్వు యోగివైతేనే ఇంకొక యోగిని గుర్తించగలవు. నువ్వు కాస్పరోవ్ అయితే కాస్పరోవ్‌ని గుర్తించగలవు! నువ్వు బిస్మిల్లాఖాన్ అయితేనే పండిత్ రవిశంకర్‌ని గుర్తించగలవు. నువ్వు యోగివైతేనే ఇంకొక యోగిని గుర్తించగలవు. అన్యథా శరణం నాస్తి ! "

## " స్వర్గం - నరకం అంటే ?"

" స్వర్గం, నరకం అన్నవి ఎప్పటికప్పుడు ప్రతి క్షణం మనం అనుభవిస్తున్న స్థితులు. అవి లోకాలు కావు స్థితులు. మన ఆలోచనా ధోరణి, మన జీవిత సరళి, వాగ్ధోరణిలన్నీ సరిగ్గా వుండాలి. ఆ సరియైన ఆలోచనాధోరణి, ద్వారానే ఆ సరియైన జీవితధోరణి ద్వారానే.... అది స్వర్గంగా అభివ్యక్తమవుతూంటుంది. మన ద్వారా మన స్థితి చుట్టుప్రక్కలకు విస్తరించి ఆ చుట్టుప్రక్కల ఉన్న స్వర్గంలో మనం మళ్ళీ జీవిస్తూ ఉంటాం. ఎలా అయితే నా నోట్లోంచి వచ్చిన మాటలు నా చెవులే స్వీకరించి నేను వింటున్నానో అలాగ అన్నమాట ! నా యొక్క కల్పనే నా సృష్టి! నా సృష్టిలోనే నేను మళ్ళీ జీవిస్తున్నాను. నా మాటలు నేను వినడం లేదూ ? వింటూన్నానా లేదా ? అలాగే మీరు సృష్టిస్తున్న నరకంలోనే మీరు జీవిస్తూంటారు! ఇప్పుడు నేను మాటలు మాట్లాడడం మానేస్తే నా మాటలు నాకు వినబడతాయా ? నేను మాటలు మాట్లాడుతూన్నంతసేపే ఆ మాటలు ఉంటాయి. ఆ మాటలు నా చెవికి వినబడుతూంటాయి. నేను మాటలు మాట్లాడడం మానేస్తే ఇప్పుడు మాటలు ఉన్నాయా ? లేవు కదా ? అలాగే స్వర్గం కానీ నరకం కానీ.... అవి ఎప్పుడు కూడా మన ద్వారానే ఎప్పటికప్పుడు అభివ్యక్తమవుతూ వుంటాయి. అభివ్యక్తమైన ఆ యొక్క స్వర్గ పదార్థం లో, నరక పదార్థం లో మళ్ళీ మనం జీవిస్తూంటాం.

ఎలాగైతే నా మాటలు నా చెవుల ద్వారా నేను వింటున్నానో.... చక్కగా బాగా ఉన్నాయనుకోండి నా మాటలు.... నా చెవులే స్వీకరిస్తాయి. నా మాటలు బాగా లేకపోతే నా చెవులే వాటిని స్వీకరించవు. దీనినే విశ్వనాథ సత్యనారాయణ గారు ఏమన్నారంటే 'నోరు పలుకుతుంటే నొసలు వెక్కిరిస్తూంటుంది'. అంటే నువ్వు సరిగ్గా పలకలేకపోతే నీ నొసలే నిన్ను వెక్కిరిస్తుందన్నాడు. నేను సంగీత జ్ఞానిని అనుకోండి.

నేను సంగీతం పాడుతున్నాను, అపస్వరాలు వచ్చాయి. నాకే బాగుండదు. నా నొసలే నన్నే వెక్కిరిస్తుంది. చూశారా, నా యొక్క అపస్వరం ద్వారా నేను నా నరకస్థితిని సృష్టించుకున్నాను. ఆ నరకస్థితిలో నేనున్నాను. చక్కగా సుస్వరం పలికాననుకోండి.... బావుంది.... ఇది నాకు స్వర్గం సృష్టించింది. ఇప్పుడే సుస్వరం ద్వారా! ఆ స్వర్గం నేను మళ్ళీ అనుభవిస్తున్నాను. కనుక 'స్వర్గం,' 'నరకం' అంటే ప్రతిక్షణం ఎవరి సృష్టిలోవారు అభివ్యక్తమవుతూ అభివ్యక్తమయిన ఆ స్థితుల్లో వారు జీవిస్తూండటమే! ఇది అనంతంగా సాగే ప్రక్రియ. నరక సృష్టి, స్వర్గ సృష్టి.... నరకజీవితం, స్వర్గ జీవితం.... మై డియర్ ఫ్రెండ్స్!

## "దయ్యాలు, ప్రేతాత్మలు వున్నాయా?"

నువ్వు చచ్చిపోతే అదే అవుతావు! దయ్యంలా తిరుగుతూంటావు ఇక్కడ! నన్ను పీడించుకుంటూ 'ఏ ప్రశ్న వెయ్యాలా ?' అని!

దయ్యం, ప్రేతం, పిశాచం అంటే ? ఒక దాని మీద విపరీతమయిన మోహం ఉన్నప్పుడు మనం శరీరం వదిలిపేట్టేసినప్పుడు అక్కడే తిరుగుతూంటాం. ఎక్కడైతే మోహం లేదో అక్కడ మనం శరీరం వదిలిపెట్టేసిన తరువాత తిరుగాడం. కనుక హరేరామశర్మ గారూ! దయచేసి మీరు శరీరం వదిలిపేట్టేసిన తరువాత ఇక్కడే ఉండి నన్ను ప్రశ్నలు వేయవద్దు! చక్కగా పై లోకాలకు వెళ్ళండి!

ప్రతి మనిషి కూడానూ 'నా ప్రశ్నకు జవాబు చెప్పండి' అంటాడు. అదేదో వాళ్ళేదో గొప్పవాళ్ళైనట్లు, వాళ్ళ ప్రశ్నలకు జవాబు చెప్పకపోతే ప్రక్కవాడు హీనుడైనట్టు, పక్కవాడు వీడి ప్రశ్నకు జవాబు చెప్పలేనట్టు ! ప్రశ్నలు వేయకపోవడమే మనస్సును పరిశూన్యం చేసుకోవడం. ఏ ప్రశ్న అయినా మీకు ఉందనుకోండి! మీకు నేను జవాబిస్తున్నట్టు కాదు! ప్రశ్న వేసే సగటు మానవుడికి నేను ఇస్తున్న సందేశం ఇది. ప్రతి చోటా నేను వెళుతున్న మీటింగ్స్‌లో ఎన్నో ప్రశ్నలు అడుగుతూంటారు. ఆ ప్రశ్నలకు నేనేదో సమాధానం చెప్పాలట నా సమాధానం వాళ్ళకు సుముఖంగా ఉండాలట. ఇదంతా కూడాను absolute nonsense! ప్రశ్నలు వేసుకునే వారు ధ్యానం చేయాలి. వారి ప్రశ్నలకు వెంటనే సమాధానాలు దొరకవు. సుదూరంగా దొరుకుతాయి! సుదీర్ఘంగా ఎంతో ధ్యాన అభ్యాసం తరువాత ప్రశ్నలు, జవాబులు కాదు.... ప్రశ్నలు, సాధనలు కావాలి! మీకు ఏ ప్రశ్న ఉంటుందో దానికి తగ్గ సాధన చెయ్యాలి.

కనుక "చనిపోయిన తరువాత ఏమవుతుంది" అని ప్రశ్న అడుగుతారు.... ఏం చెప్పను వాళ్ళకు? ఏం చెప్తే వాళ్ళకు ఏం అర్థం అవుతుంది. నా సమాధానం వాళ్ళకు సంతృప్తి నిస్తుందా ? సమాధాన పరుస్తుందా ? ఏమీ కాదు ! అంతా బూడిదలో పోసిన పన్నీరు. అంతే ! ధ్యానం చేయవలె ! సాధన చేయవలె ! అభ్యాసం చేయవలె ! ఏ ప్రశ్నకైనా సమాధానం మన దగ్గరి నుంచే, మన లోపలి నుంచే వస్తుంది - ధ్యానం ద్వారా ! ఏ ప్రశ్నకైనా !

కనుక హరేరామ శర్మ గారూ ! ధాన్య సభలలో ధ్యాన కార్యక్రమాలలో అడిగే అందరి ప్రశ్నలకూ ఈ యొక్క సమాధానం ద్వారా నేను వారందరికీ సమాధానం ఇస్తున్నాను. దయచేసి ధ్యానంలో, ధ్యాన సభలలో ధ్యాన కార్యక్రమాలలో విస్తారంగా వేసే ప్రశ్నలను ఉపసంహరించండి. ధ్యాన విధానం మాత్రం తెలుసుకోండి. ధ్యాన అభ్యాసం చేయండి. ఒక్కటే ఒక్క ప్రశ్న ఉండాలి ? ధ్యానం చేసే విధానం ఏమిటి ? అంతేగానీ జీవితం పట్ల ప్రశ్నలకు ఆ సమాధానాలు ఎందుకూ పనికిరావు!

## " చూసినంతనే , విన్నంతనే రాదు !"

అర్జునుడికి కృష్ణుడు భగవద్గీతలో అన్నీ చెప్పాడు ! కానీ, మరి ఏమైనా ఆత్మజ్ఞానం వచ్చిందా ! అభిమన్యుడు చనిపోయిన తరువాత అర్జునుడు కృష్ణుడు గల్లా పట్టుకుని 'ఏమయ్యా ! నీ వల్లనే నా కొడుకు చచ్చిపోయాడు' అన్నాడు. భగవద్గీత స్వయంగా విన్న అర్జునుడికి ఏమైనా ఆత్మజ్ఞానం వచ్చిందా ? వస్తుందా ? Impossible ! గవాస్కర్ క్రికెట్ ఆడడం చూస్తే నాకు క్రికెట్ వస్తుందా ? బిస్మిల్లాఖాన్ షహనాయి వింటే నాకు షహనాయి వస్తుందా ? రాదు కదా ! మీ ప్రశ్నలకు కానీ, ఎవరి ప్రశ్నలకు కానీ ఇంకొక మనిషి సమాధానం ఇవ్వడం అసంభవం. ఎంత అసంభవమంటే గవాస్కర్ క్రికెట్ చూసి నాకు క్రికెట్ వస్తుంది అనుకుంటే.... ఎంత అసంభవమో అంత అనుభవం అన్నమాట! కనుక మై డియర్ ఫ్రెండ్స్ ధ్యాన విధానం నేర్చుకోవాలి ! ధ్యాన సాధన చేయాలి ! ధ్యాన సాధన ద్వారా సకల జీవిత మౌలిక ప్రశ్నలకు మనలోంచి మనకు అత్యుత్తమంగా సమాధానాలు ఉత్పన్నమవుతాయి.

## " మార్గం !"

ఈ రోజు చివరగా ధాన్య ప్రపంచానికి ఇచ్చే సందేశం ఏమిటంటే.... ఎవరి ప్రశ్నలకు వారి వారి సాధన ద్వారానే వారి వారి ధ్యాన అభ్యాసం ద్వారానే వారి వారి సమాధానాలు లభ్యం అవుతాయి ! గౌతమ బుద్ధుడు తన ప్రశ్నలకు తానే సమాధానాలు తెలుసుకున్నాడు గదా ! వర్ధమాన మహావీరుడు తన ప్రశ్నలకు తానే సమాధానం తెలుసుకున్నాడు కదా! మరి మీరు ఎందుకు తెలుసుకోరు ?

గౌతమ బుద్ధుడి మార్గమే మార్గం ! మహావీరుడి మార్గమే మార్గం ! ఏమిటా మార్గం ? మన ప్రశ్నలకు మనమే.... మన ధ్యాన సాధన ద్వారానే.... సమాధానాలు తెలుసుకోవడం థ్యాంక్యూ వెరీమచ్ హరేరామ శర్మ గారూ!

*(ధ్యానులందరికీ వచ్చే సందేహాలకు సమాధానాలు ఇచ్చి మమ్మల్ని తృప్తిపరచిన బ్రహ్మర్షి పత్రీజీ గారికి పిరమిడ్ ధ్యాన ప్రపంచం తరపున కృతజ్ఞతలు !)*

* * *



Bhakthi ye Mukthi
309
MRP Rs. 20.00
www.pyramidvalley.org
Telugu

309

ధ్యాన లహరి పబ్లికేషన్స్